# విశాలాంధ్ర గోదావరి జిల్లా
## ఏలూరు, పశ్చిమగోదావరి

# పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : కార్మికులు పోరాటాల ద్వారా తమ బలాన్ని చూపితేనే ప్రభుత్వాలు దిగివస్తాయని, భవననిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని పలువురు నాయకులు స్పష్టం చేశారు. భవననిర్మాణ కార్మిక సంఘాన్ని బలోపేతం చేయడానికి కార్మికులు కృషి చేయాలని వారు పిలుపు ఇచ్చారు. తాడేపల్లి గూడెం ఏరియా తాపీ, వడ్రంగి, సెంటరింగ్, రాడ్ బెండింగ్ , వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) సర్వసభ్య సమా వేశంలో వారు మాట్లాడారు. సిపాయిపేట భవన నిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశానికి యూనియన్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భవననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు సమావేశాన్ని ప్రారంభిస్తూ గతమూడేళ్ళుగా రాష్ట్ర ప్రభుత్వ ఇసుక విధానం , ఐరన్ ,సిమెంటు , నిర్మాణసామగ్రి ధరల పెరుగుదల వల్ల భవన నిర్మాణరంగం తీవ్రంగా దెబ్బతిన్నదని అన్నారు. కార్మికుల పరిస్థితులు కుదేలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన భవననిర్మాణ కార్మికుల జాతీయ మహాసభలు విజయవంతం చేసిన కార్మికులకు, మేస్త్రిలకు , దాతలకు లక్ష్మణరావు ధన్యవాదాలు తెలిపారు.

ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమ సుందర్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులుగా కొనసాగుతున్న భవననిర్మాణ కార్మికులకు కనీస వేతనాలు, పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్య పరిరక్షణ, పనిచేయలేని వృద్ధ కార్మికులకు పింఛను కోసం యూనియన్ పోరాడుతుందని అన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న వెల్ఫేర్ బోర్డును ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, బోర్డును తిరిగి పనిచేయించడానికి ఏఐటియుసీ శాయశక్తులా పోరాటం సాగిస్తుందని వివరించారు. యూనియన్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ఏరియాలో గతఏడాది వ్యవధిలో పని ప్రదేశంలో 17 ప్రమాదాలు జరిగాయని, కార్మికులు జాగ్రత్తగా పనిచేయాలని, పనిచేసేటప్పుడు మొబైల్ వినియోగించవద్దని సూచించారు.

యూనియన్ ప్రధానకార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డులో క్లెయిములు పరిష్కారం చేయడం లేదని దానికోసం యూనియన్ పట్టుదలతో పోరాటం సాగిస్తోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ బోర్డును కాపాడుకుంటామని అన్నారు. సమావేశంలో జిల్లా యూనియన్ ఉపాధ్యక్షుడు అంకం భాస్కరరావు, జిల్లాకోశాధికారి మెండెం జేమ్స్, సీనియర్ నాయకులు రాజా వెంకటరావు, తదితరులు మాట్లాడారు. ఏరియా కమిటీ కోశాధికారి కాకర్ల రాంబాబు, సీనియర్ నాయకులు పులపా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## స్పందన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి

విశాలాంధ్ర - భీమవరం : స్పందనలో అందిన వినతుల పరిష్కారం అర్జీదారులు ఆనందం కలిగించేలా ఉండాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. సోమవారం భీమవరం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్జీలు తిరిగి రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్య పై రెండవ సారి స్పందన లో పిర్యాదు రాకుండా సమస్య పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మండల స్థాయిలో అధికారులు సమస్యను పరిష్కరించినట్లయితే వారు జిల్లా కలెక్టర్ కార్యాలయం నకు రావలసిన అవసరం ఉండదని, మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 196 దరఖాస్తులు వచ్చాయని, వీటన్నిటిని త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టరు అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి, ఆర్‌డిఓ కె. కృష్ణవేణి, డి పి ఓ యం. నాగ లత, డి ఎల్ డి ఓ కె .సి .హెచ్. అప్పారావు , భీమవరం డిఎస్పి బి. శ్రీకాంత్ , వివిధ శాఖల జిల్లా అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ రిక్రూట్‌మెంటులో దళారులను నమ్మొద్దు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : పోలీసు రిక్రూట్మెంట్ లో దళారులను నమ్మి ఎవరు మోసపోవద్దని పోలవరం డిఎస్‌పి కె.లతాకుమారి సూచించారు. సోమవారం జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలవరం డివిజన్ పరిధిలో గల 88 మంది గ్రామ మహిళా పోలీస్ ల పనితీరు విధివిధానాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 7 మండలాల పరిధిలో 43 మంది పోలీసులు మెయిన్స్‌కు ఎన్నికయ్యారన్నారు. ఎవరైనా దళారులు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. నేర సమీక్ష సమావేశం లో మిస్సింగ్ కేసులు , దిశ లపై ఫోక్సో కేసులు 100 కాల్స్ పై గ్రామ మహిళా పోలీసులు మంచి ప్రతిభను చూపిస్తున్నారన్నారు. బాల కార్మికులపై దృష్టి పెట్టి ఇటుకల బట్టీల వద్ద ఉంటే గుర్తించి వారిని విముక్తి చేయాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం ప్రమాదకరమని కళాశాలల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి, కుక్కునూరు, పోలవరం సిఐలు బి. వెంకటేశ్వరరావు, కె. సత్యనారాయణ, కె. విజయబాబు, జీలుగుమిల్లి ఎస్ఐ వి. చంద్రశేఖర్ డివిజన్ పరిధిలో ఎస్ఐ లు జీలుగుమిల్లి ఏఎస్ఐ ఎన్. నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరి పంట పొలాలకు సాగునీరు అందించాలి

విశాలాంధ్ర - గణపవరం: ఒకప్పుడు పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాంతంలో వరి పండించే రైతులకు అన్నం పెట్టే అన్నపూర్ణగా జిల్లా పేరుపొందింది. దేశంలోనే ప్రసిద్ధి చెందిన జిల్లాగా పశ్చిమగోదావరి నిలిచిందని ప్రస్తుతం జిల్లాలో వరి పండించే రైతులకు సాగునీరు అందడం లేదని గణపవరం గ్రామానికి చెందిన రాష్ట్ర రైతు నాయకులు, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి సభ్యులు రుద్రరాజు వెంకట సూర్యనారాయణ రాజు (ఆర్ వి ఎస్ రాజు) అన్నారు. సోమవారం వరి పండించే రైతులు సరిపల్లె దుర్గమ్మ గుడి నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం తహసిల్దార్ కృష్ణ స్వామి, ఏవో యర్రశెట్టి ప్రసాద్, ఎంపిడిఓ జ్యోతిర్మాయిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ వి ఎస్ రాజు మాట్లాడుతూ పిప్పర నుండి కొత్తపల్లి కాలువ ద్వారా వరి పంట పొలాలకు నీరు అందించాలని అన్నారు.కాలువలో తూడు తీసి గట్టును ప్రతిష్ట చేయాలని పేర్కొ న్నారు. వరి మాగాణి భూములు లకు చెందిన హక్కులను ప్రభుత్వం, ప్రజాప్రతి నిధులు, వివిధ శాఖల అధికారులు చిత్త శుద్ధితో అమలు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాతపాటి సీతారామరాజు, మద్దాల ఆది గోపాలం, బందారు శ్రీనివాసు, ముద్దక వెంకటేశ్వరరావు, తదితర రైతులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలకు మండల స్థాయిలోను ఆడిట్ కమిటీని ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలోని మండల పరిధిలో స్పందన అర్జీలపై ఆడిట్ నిర్వహించడానికి మండలస్థాయిలోను ఆడిట్ కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు, జెడ్పి సిఇఓ రవికుమార్, డిఆర్ డిఏ పిడి విజయరాజు, వ్యవసాయశాఖ జేడి రామకృష్ణ, ఇన్‌చార్జి డిఆర్ ఓ, ఆర్డిఓ కె. పెంచల కిషోర్ లతో కలిసి స్పందన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ స్పందన అర్జీలకు జిల్లా స్థాయిలో ఆడిట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల స్థాయిలోను స్పందన అర్జీల ఆడిట్ నిర్వహించడానికి మండలస్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి వారానికి ఒకసారి స్పందన అర్జీలపై రివ్యూచేసి నాణ్యమైన సమాచారాన్ని అర్జీదారులకు అందజేయాలన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా 207 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పంట నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - ఉండి : ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని రైతు భరోసా కేంద్రం జాయింట్ డైరెక్టర్ వల్లూరి శ్రీధర్ అన్నారు. సోమవారం ఉండి మండలం పాములపర్రు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య అధ్యక్షతన రబీ పంటకు సంబంధించి నిర్వహించిన పంట నమోదు కార్యక్రమంలో వల్లూరి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పంట పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఏ ఏ రైతులు సొంతంగా పండిస్తున్నారు ఎవరు కౌలు రైతులకు ఇస్తున్నారో విషయాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కే ఏ ఎస్ ఎస్ శ్రీనివాస్, ఉద్యానవన సహాయకులు వై.దీప్తి, గ్రామ రెవెన్యూ అధికారి జి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.


## విలేకరులు కావలెను

విశాలాంధ్ర దినపత్రికకు పశ్చిమగోదావరి జిల్లాలో దిగువ పేర్కొన్న మండలాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.

ఇంటర్మీడియట్ చదివి తెలుగు భాషా పరిజ్ఞానం కలిగి సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన ఉన్న వ్యక్తులు అర్హులు.

పనిచేయవలసిన మండలాలు :
నరసాపురం, అత్తిలి, ఆచంట, పెనుగొండ, పాలకోడేరు

గమనిక : ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 7386300533


## ఆర్థిక అక్షరాస్యత అవసరం

**- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్**

విశాలాంధ్ర - ఏలూరు : ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకొని క్రమ శిక్షణ పాటించడం అలవరచుకోవాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఆర్థిక అక్షరాస్యత అవగాహనపై రూపొందించిన మూడు రకాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు, డిఆర్ ఓ ఎవిఎస్ఎస్ మూర్తి, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎం. గోపాలకృష్ణమూర్తి, స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజరు టి.వి.ఎస్.వి. రాజు, ఎస్ బిఐ అసిస్టెంట్ జనరల్ మేనేజరు శివానంద్, ఎల్ డిఎం ఎస్ఎస్ఏ వెంకటేశ్వరరావు, ఆర్ డిఓ కె. పెంచల కిషోర్, జెడ్పి సిఇఓ కె. రవికుమార్, డిఆర్ డిఏ పిడి ఆర్ విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగ సేవల్లో ఇటీవల కాలంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయని, బ్యాంకు ఖాతాదారులు ప్రతిఒక్కరూ నగదు రహిత లావాదేవీలపై పూర్తిస్థాయి అవగాహన కలిగివుండాలన్నారు. ఫిబ్రవరి 13 నుండి 17 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు సందర్భంగా ఆర్ బిఐ థీమ్ గా ఎంచుకున్న మంచి ఆర్థిక ప్రవర్తన- మీరక్షకుడు అనే నినాదాన్ని ప్రజల్లో విస్తృతంగా అవగాహన పరచాలన్నారు.

## మేజిక్ స్టార్ బోస్‌కు భారతీయ కళారత్న అవార్డు

విశాలాంధ్ర -భీమవరం :పట్టణానికి చెందిన మేజిక్ స్టార్ బోస్ భారతీయ కళారత్న అవార్డును పద్మశ్రీ మహేష్ బాత్రో చేతుల మీదుగా అందుకున్నారు. కళా రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను పూణేకు చెందిన గ్లోబల్ స్కాలర్స్ సంస్థ ఈ అవార్డును గోవాలో సోమవారం అందచేసింది. మేజిక్ రంగంలో దేశ విదేశాల్లో పలు ప్రదర్శనలు ఇవ్వడమే గాకుండా మేజిక్ రంగంలో పలు పరిశోధనలు కూడా చేస్తున్న బోస్ ను ఈ అవార్డు వరించింది. మేజిక్ స్టార్ బోస్ ను పుర ప్రముఖులు, కళాకారులు అభినందించారు.

## వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు

విశాలాంధ్ర-వీరవాసరం: వైద్యశిబిరాల వల్ల అత్యాధునిక వైద్య పరీక్షలు ప్రజలకు అందుబాటు లోకి వస్తాయని రాయకుదురు ఉమా మూలేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ కాయల నానిబాబు తెలిపారు. మండలంలోని రాయ కుదురు శ్రీ ఉమా మూలేశ్వర స్వామి వారి దేవస్థానము శివాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఆనంద సాయి చారిటబుల్ ట్రస్ట్ భీమవరం వారి ఆధ్వర్యంలో పాలకొల్లు నేత్ర కంటి హాస్పటల్ వారి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 93 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఐదుగురిని కంటి ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. మందులు అవసరమైన 43 మందికి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరావు, క్యాంపు కోఆర్డినేటర్ మోహన్, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు అడబాల రామకృష్ణుడు, కటకం సుబ్రహ్మణ్యం నేత్ర కంటి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిల్లర రాజకీయాలకు నిలయంగా టీడీపీ

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌కు, వైసీపీకి రోజు రోజుకూ పెరుగుతున్న ప్రజాబలం చూసి తట్టుకోలేని టీడీపీ నాయకులు ఆక్రోశంతో చిల్లర వ్యాఖ్యలు చేస్తూ నీచమైన రాజకీయాలకు తెరలేపుతున్నారని వైసీపీ సోషల్ మీడియా విభాగం జిల్లా కోకన్వీనర్ బుడితి సుజన్ కుమార్ పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో దూసుకు పోతున్న డా.కారుమూరిని ఎదుర్కొనే సత్తువ లేక మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణకు అత్యంత సన్నిహితంగా ఉండే కొంతమంది ఐటిడిపి కార్యకర్తలుతో సోషల్ మీడియా వేదికగా అసభ్యపదజాలంతో వ్యాఖ్యానాలు చేస్తూ వికృత ఆనందం పొందాలని ప్రయత్నాలు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఇటువంటి దుర్మార్గమైన సంస్కృతి గతంలో ఎన్నడూ లేదని, ఇటువంటి వాటిని రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. టిడిపి నాయకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రజాసమస్యల పై పోరాటాలు చేసి ప్రజల మన్నలను పొందాలన్నారు.

## పోలీస్ స్పందనలో 16 ఫిర్యాదులు

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : భీమవరం డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పోలీస్ స్పందన కార్యక్రమానికి 16 ఫిర్యాదులందాయని వాటిని సత్వరమే చట్ట ప్రకారం విచారణ జరిపి, ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ ఎస్‌పి ఏవీ సుబ్బరాజు సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు ఇచ్చారు.

## మద్రపు, వంకేనేని ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

**- ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు**

విశాలాంధ్ర - ఏలూరు: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు, ఏఐటియుసి జిల్లా నాయకులు మద్రపు సత్యనారాయణ , ఏఐటియుసి జిల్లా నాయకులు సిపిఐ ఏలూరు నగర మాజీ కార్యదర్శి వంకినేని మల్లికార్జున రావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని జిల్లాలో, ఏలూరు నగరంలో కార్మిక సంఘాల నిర్మాణానికి, సిపిఐ అభివృద్ధికి, ఏఐటీయుసి, సిపిఐ కార్యకర్తలు క్రియాశీలంగా పనిచేయాలని ఏఐటీయుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కొత్తపేట సెంటర్లో మద్రపు సత్యనారా యణ 21 వర్ధంతి, వంకినేని మల్లికార్జునరావు 9వ వర్ధంతి కార్యక్రమాలను ఏఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి ఏఐటీయూసీ జిల్లా నాయకులు కడుపు కన్నయ్య, పూలమాలవేసి నివాళులర్పించారు. మద్రపు స్థూపానికి ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు గొట్టాపు భాస్కర్ పూలమాలవేసి నివాళులర్పించారు. వర్ధంతి కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వర రావు, కడుపు కన్నయ్య, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ కార్యదర్శి బి. రాంబాబు, కోశాధికారి గొట్టాపు భాస్కర్ తదితరులు మాట్లాడుతూ ఆర్టీసీలో కార్మిక సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలకు ఉద్యమాలకు నాయకత్వం వహించిన సత్యనారాయణ, మల్లికార్జున రావుల పోరాట స్ఫూర్తిని నేటితరం నాయకత్వం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్రపు సత్యనారాయణ తనయుడు జగదీష్ ఏఐటీయుసి, సిపిఐ నాయకులు కార్యకర్తలు ఎస్.సంజీవరావు, బట్టా మాణిక్యాలరావు, కురెళ్ళ వర ప్రసాద్, రెడ్డి శ్రీనివాస్ డాంగే, చింతల సూర్యనారాయణ, పొటేలు పెంటయ్య, గేదెల నాగేశ్వరరావు, బుగ్గల ప్రభాకర్, సామన శ్రీరాములు, పాల రామకృష్ణ, యర్ర వెంకటేశ్వర్లు, కొత్తల రాము, కె జగన్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - లింగపాలెం : పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన జిఓ నెంబర్ 680ను అమలు చేయాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో లింగ పాలెం ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నా చేశారు. పారిశుధ్య కార్మికులకు రూ. 10 వేలు వేతనం ఇవ్వాలని, పెండింగులో ఉన్న ఎరియర్ బకాయిలు మంజూరు చేయాలని కోరారు. సర్పంచ్‌లతో నిమిత్తం లేకుండా కార్మికుల ఖాతాల్లో నిధులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పనులు చేసేందుకు మాస్కులు, గ్లౌజులు, శానిటైజర్లు అందచేయాలని కోరారు. రాజకీయాల వల్ల పారిశుధ్య కార్మికులను తొలగించవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి చింతలపూడి ఏరియా అధ్యక్షులు కె.బుచ్చిబాబు, కార్యదర్శి తుర్లపాటి బాబు, రేపల్లి శ్రీనివాసరావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు.

## పశు వైద్య నిపుణులు విజయ్ కుమార్ మృతికి సంతాపం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ సోదరుడు పశువైద్య నిపుణులు, డాక్టర్ దూసనపూడి విజయ కుమార్ మృతికి సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమా రావు తీవ్ర సంతాపాన్ని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.సోమవారం తాడేపల్లిగూడెంలో విజయకుమార్ సోదరులను కుటుంబ సభ్యులను పరామర్శించి విజయకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఆస్తి పన్ను బకాయిదారులపై కొరడా

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ పరిధిలోని ఆస్తి పన్ను బకాయి దారులపై మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమ వారం కార్యాలయ అధికారులు కొరడా ఝుళిపించారు. పట్టణంలోని మొండి బకాయి దారులకు రెడ్ నోటీస్ ఇచ్చి 15 రోజులు దాటినా స్పందించని బకాయి దారుల వద్దకు మున్సిపల్ కమీషనర్ తో పాటు ఇతర మున్సిపల్ అధికారులు వెళ్లి ఆస్తి పన్ను చెల్లించవలసినదిగా కోరారు. బకాయిలు చెల్లించని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ భవన యజమాని చిట్టూరి దశరథ రామ్ రూ.12 లక్షల 13 వందల 57 , శ్రీచైతన్య స్కూల్ భవన యజమాని ఎం.విజయ సారథి రూ. 9 లక్షల 26 వేల 550 బకాయిలు చెల్లించక పోవ దంతో ఆ భవనాలకు సంబంధించిన వాటికి తాళాలు వేసి జప్తు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పి భవానీ ప్రసాద్ సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ ఎన్.సుబ్బారావు, కార్యాలయ మేనేజర్ కె.వెంకట రమణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి.జగదీశ్వర రావు, అసిస్టెంట్ ఇంజనీర్ పి.సంధ్యారాణి, శానిటరీ ఇన్స్పెక్టర్ పి.వి.రమణ, ఆయా సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


### దస్తావేజు పోయినది

నేదూరి సత్యమణి, W/o. లేట్ సత్యనారాయణ మూర్తి, D.No: 19-16-82/2, సుంకర వీరాస్వామి నగర్, రోడ్ నెం-4, ఎస్.పి.స్ట్రీట్, భీమవరం-1, భీమవరం(మం), పశ్చిమగోదావరి జిల్లా.,ది.10-02-2023వ తేదీ ఉదయం 10 గం.లకు ఎస్.పి. స్ట్రీట్ నుండి బ్యాంక్ కాలనీకి ఇల్లు మారుతుండగా పాలిథిన్ కవరులోని నా యొక్క ఒరిజినల్ ఇంటి స్థలం దస్తావేజు నెం:756/1989 పోయినది. పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా నా యొక్క ఒరిజినల్ ఇంటి స్థలం దస్తావేజు దొరకలేదు. కావున దొరికిన వారు క్రింది అడ్రసులో అందచేయ ప్రార్థన.

నేదూరి సత్యమణి,
W/o. లేట్ సత్యనారాయణ మూర్తి,
D.No: 19-16-82/2, సుంకర వీరాస్వామి నగర్,
రోడ్ నెం-4, ఎస్.పి.స్ట్రీట్, భీమవరం-1,
భీమవరం(మం), పశ్చిమగోదావరి జిల్లా.


## స్వచ్ఛ భారత్ కార్మికుల జీతాలు విడుదల చేయాలి

**ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు**

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: గ్రామ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు (గ్రీన్ అంబాసిడర్స్), స్వచ్ఛభారత్ కార్మికులు పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణం విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గ్రామీణ పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు పెండింగ్లో ఉన్న 12 నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం స్థానిక తహాల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చలసాని రామారావు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని, జీవో నం.680 ప్రకారం రూ.10వేలు జీతం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి జీతాలు ప్రతినెల విడుదల చేయాలని,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం కింద రూ.18 వేలు ఇవ్వాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు.ప్రతి రెండు నెలలకు ఒకసారి షూస్, బ్లౌజెస్ ,శుభ్రం చేసుకోవడానికి కొబ్బరి నూనె, మాస్క్ ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కన్వీనర్ బత్తుల వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, పారిశుధ్య కార్మికులు బి. నాగేశ్వరరావు, బి. నాగరాజు, సిహెచ్ తిరుపతయ్య, థామస్, జ్యోతి, వెంకయ్య, పంగిడియ్య, కృపానందం, నిరీక్షణ రావు, సుధీర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామపంచాయతీలో పనిచేసే స్వచ్ఛభారత కార్మికుల ఆగిరిపల్లి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన గౌరవాధ్యక్షులుగా చాట్ల పుల్లారావు, అధ్యక్షులుగా కలపాల నిరీక్షణ రావు,ప్రధాన కార్యదర్శిగా బంతుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎలమర్తి అబ్రహం, జాయింట్ సెక్రటరీగా సిహెచ్ తిరుపతిరావు,కమిటీ సభ్యులుగా థామస్,కే గాపయ్య జాన్ ,పంకిడయ్య నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ప్రజలు కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కాశిపాడు ఆరోగ్య ఉప కేంద్రం వద్ద ఆజాదీకా అమృత మహోత్సవ్ కుష్టు వ్యాధి పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం స్పర్శ కుష్టు వ్యాధిపై అవగాహన నిర్మూలన ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించినట్లు లెప్రసి నోడల్ పర్సన్ నామాల రాజు తెలిపారు. కుష్టు నివారణకు మల్టీ డ్రగ్ థెరపీ ఒకటే మార్గమని తెలియజేశారు. శరీరంపై ఎటువంటి మచ్చలు వున్నా వెంటనే ముందుగా ఆరోగ్య సిబ్బందికి గాని ప్రభుత్వఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో వున్న కుష్టు వ్యాధి గ్రస్తులకు పెనుమత్స సుబ్బ రాజు (సుబ్బన్న), భీమవరం నూతన దుస్తులు, పండ్లు రొట్టెలు అందచేశారు. జంపన పద్మావతి, జి. బాల రాజు,సొసైటీ కార్యదర్శి ఐ.రామ కృష్ణ రాజు,గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆర్ డి రామారావు, జిల్లా పి.యం.పి అధ్యక్షుడు ఏ. ఆర్. కె.పరమేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 17 వరకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన

విశాలాంధ్ర -ఏలూరు : ఈనెల 13 నుండి 17వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు.ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం పోస్టర్లను సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక అవసరాలపై అవగాహన కల్పించడం, బ్యాంకు కాంటాక్ట్ నంబర్లు, డెబిట్ క్రెడిట్ కార్డులు, ఓటిపి సీవీసీ, పాస్ వర్డ్, పిన్, బ్యాంక్ అకౌంట్, ఇతర వ్యక్తిగత వివరాలు ఎవరితోనూ పంచుకోకూ డదని జిల్లా కలెక్టర్ తెలిపారు. బ్యాంకు సేవలలో డిజిటల్ సేవలు సౌకర్యంతో, సురక్షితంగాను ఉంటాయని వీటిని వినియోగించుకునే సమ యంలో మోసాలకు గురికాకుండా డబ్బు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. సురక్షిత మైన ఆర్థిక వ్యవస్థ నిర్వహించడమే సురక్షితమని కలెక్టర్ అన్నారు. బ్యాంకులో నుండి రుణం పొందేందుకు సులభతరమైన పరిష్కారం ఉందని, నియంత్రణ సంస్థల నుండి మాత్రమే రుణం తీసుకోవాలని అప్పు తీసుకునే ముందు వారి గురించి బాగా తెలుసుకోవాలని, అన్ని వివరాలు నియమ నిబంధనలు జాగ్రత్తగా చదివి వడ్డీ ధర మరియు ఇతర వివరాలు తెలుసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి , డి ఆర్ ఓ కె. కృష్ణ వేణి , ఎల్ డి ఎం రమణ , డిపిఓ యం.నాగ లత, డి ఎల్ డి ఓ కె. సి. హెచ్ .అప్పారావు, భీమవరం డిఎస్పి వి. శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం మండల రెండవ మహాసభ పిట్టా వీరయ్య అధ్యక్షతన సోమవారం చాకరపల్లి గ్రామంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కారం దారయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, మండల కార్యదర్శి బాడిశ రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గిరిజన సంఘం నూతన మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కారం బొజ్జి, పిట్టా వీరయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 33 మందిని కౌన్సిల్ సభ్యులుగా అందులో నుండి 12 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో కొండపల్లి వాసి మృతి

విశాలాంధ్ర - కుక్కునూరు : అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి గ్రామం వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో కుక్కునూరు మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పేరాల ప్రసాద్ (30) అనే యువ కుడు మృతి చెందాడు. కొండపల్లి గ్రామం నుంచి తెలంగాణ రాష్ట్రం అశ్వరావు పేటకు పత్తి అమ్ము కోవడా నికి లోడుతో ట్రాక్టర్ వెళుతోంది . అదే సమయంలో ట్రాక్టర్ ని వెనకనుంచి చూస్తున్న కంటైనర్ లారీ ఢీకొనడంతో పత్తి ట్రాక్టర్ పై ఉన్న ప్రసాద్ కింద పడిపోయాడు. దీంతో కంటైనర్ చక్రాలు ప్రసాదు పైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పొంచి నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**తల్లడిల్లుతున్న నిరుపేద కుటుంబం :** మృతుడు ప్రసాద్‌ది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రసాద్ చిన్న కుమార్తెకు 21 రోజు బారసాల వేడుక త్వరలో చేయాల్సి ఉంది. పనికి వెళ్లగా వచ్చిన డబ్బులతో వేడుక చేద్దాం అని భార్యకు చెప్పాడు. అంతలోనే జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం అంతా తల్లడిల్లుతోంది.

## కొల్లేరుకు న్యాయం చేస్తే పార్టీ మారతా

విశాలాంధ్ర -కైకలూరు : పార్టీ మార్పు విషయంపై మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ మీడియా తో మాట్లాడారు. కొల్లేరు లోఅదనంగా ధ్వంసం చేసిన 7500 ఎకరాలు, మూడవ కాంటూరు కుదింపు, ధాన్యం కొనుగోలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, విదేశీ విద్య సమస్యల ను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టి కి తీసుకొని వెళుతున్నానని, సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇస్తే ప్రజల అభిప్రాయం మేరకు పార్టీలో చేరతానని అన్నారు. ప్రస్తుతం నేను తెలుగు దేశంపార్టీకి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నానని కైకలూరు నియోజకవర్గంలో పార్టీలో గ్రూప్ రాజకీయాలు ఉన్నాయని, కైకలూరులో పార్టీ సీటు నుండి అధిష్టానం స్పష్టమైన హామీ ఇవ్వ క పోవడంతో పార్టీ మార్పు విషయం నియోజక వర్గ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి స్పష్టమైన హామీ ఇస్తానన్నారు.

# అమరవీరుల త్యాగాలను స్మరిద్దాం

**విశాలాంధ్ర - నిడదవోలు :** నేడు వేలంటైన్ డే. ఈ రోజు మళ్ళీ తిరిగి రాదన్నట్టుగా జీవితంలో ఏదో సాధించేసినట్లు సంబరాల్లో మునిగి తేలుతూ పార్కుల్లోనూ పబ్ లోను ఉత్సాహంగా గడుపుతారు. నిడదవోలుకు చెందిన కె. శశిరేఖ మాత్రం వినూత్న శైలిలో ఆమె ఆలోచనను వ్యక్త పరిచారు. జమ్ము కాశ్మీర్ లో జరిగిన పుల్వామా దాడికి నేటితో నాలుగు సంవత్సరాలు పూర్తయింది. 2019 ఫిబ్రవరి నెల 14న జరిగిన ఈ దాడిలో 40 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్), సైనికులు,ఒక ఉగ్రవాది మరణించారు. అమరులైన 40 జవానుల కుటుంబాల కళ్ళల్లో నేటికీ కన్నీళ్ళు తిరుగుతున్నాయి. దేశాన్ని ముందుండి నడిపించాల్సిన యువత మాత్రం వెలంటైన్స్ డే సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఏం జరుగుతుంది ఈ యువతకు?యువత ఎటువైపు పయనిస్తోంది? దేశం కోసం వారి ప్రాణాలు పణంగాపెట్టి మన రక్షణ కోసం సరిహద్దుల్లో నిలబడి కంటి మీద కునుకు లేకుండా శ్రమించేది సైనికులు.... అదే వయసుకు చెందిన మన దేశ యువత మాత్రం ఈ పాశ్చాత్య సంప్రదాయానికి అలవాటు పడి వీర జవాన్ల ప్రాణ త్యాగం మరచిపోయి,వారి త్యాగానికి విలువ ఇవ్వకుండా... చిన్న పెద్ద తేడా లేకుండా ఈ ప్రేమికుల రోజును గొప్పగా జరుపుకుంటున్నారు.పుల్వామా దాడి జరిగిన ఇదే రోజును స్మరించుకుని కొన్ని కుటుంబాలు ఆదరణ లేక, ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి నిస్సహాయ స్థితిలో వున్నాయి.. వారికి అండగా వుండేది ఎవరు? వారికి ధైర్యాన్ని ఇచ్చేది ఎవరు? సాటి మనుషులుగా మనమే కదా వారికి తోడుగా నిలబడాలి. కాశ్మీర్ లోని పుల్వామా జిల్లాలో వున్న లేదిపురా ప్రదేశంలో జరిగిన ఈ ఘటనలో మరణించిన ఆ వీర సైనికుల ఫోటోలు ఉండాల్సింది మన వాట్సాప్ స్టేటస్ లో కాదు, మన గుండెల్లో. వారి ధైర్య సాహసాలు ఊర్లల్లో,వీధుల్లో వివరించాలి. వారి త్యాగాన్ని ఈ ఒక్క రోజు మాత్రమే కాదు,ప్రతీ రోజు దేశ ప్రజలు గుర్తుకు తెచ్చుకోవాలి. అన్నిటి కన్నా దేశాన్ని మిన్నగా ప్రేమించాలి అనే అవగాహన ప్రజల్లో తీసుకురావాలి.దేశం కొరకు పాటు పడుతున్న సైనికులకు సహాయం చేయాలి.....ఆ అమర వీరుల త్యాగాన్ని స్మరిస్తూ ఈ రోజును వారి త్యాగానికి అంకితం చేద్దాం..జై హింద్,జై భారత్.

## గుండుగోలను హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**విశాలాంధ్ర- భీమడోలు :** 40ఏళ్ల తరువాత పూర్వవిద్యార్థులు ఒకచోట కలుసుకోవడం చెప్పుకోలేని మధురాను భూతిని కలిగిస్తుందని గుండుగోలను పూర్వవిద్యార్థులు తమ ఆనందం వ్యక్తం చేసారు. ఆదివారం భీమడోలు మండలం గుండుగోలను శ్రీమావులేటి సోమరాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 1982-83 విద్యాసంవత్సరంలో పదవతరగతి చదివిన సుమారు 75 మంది పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గురువులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సంఘమేశ్వరరావు, అన్నపూర్ణ, రమణకుమార్, ప్రస్తుత హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు దుర్గాసునీతా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు పూర్తి గుర్తింపు లభిస్తుంద న్నారు. విద్యార్థుల ఉన్నతిని తెలుపుతుంటే చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గురువులు చూపించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం ప్రతి విద్యార్థీ వివిధ వృత్తుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగుతూ ఆనంద జీవితాన్ని గడుపుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రేమకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**విశాలాంధ్ర-టి.నరసాపురం :** ఎం ఎల్ సి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మండల అభివృద్ధి అధికారి ఎన్ టి స్వామి తెలిపారు. జిల్లా లో ఎంఎల్ సి ఎన్నికల నేపథ్యంలో సోమవారం గ్రామ పంచాయతీలో రాజకీయ పార్టీల కు చెందిన ఫ్లెక్సీలను తొలగించి,నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈనెల 11వ తేదీ నుంచి మార్చి 16 వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు కోడ్ నిబంధనలను అన్ని గ్రామ పంచాయితీల్లో అమలు పరచాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించామన్నారు.ఎన్నికల కోడ్ నిబంధనలు గ్రామస్థాయిలో అమలు చేస్తున్నామని ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మోసపూరిత పరిపాలనతో ప్రజలు అవస్థలు

**విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం:** ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జి వలవల బాబ్జి ఆరోపించారు. సోమ వారం టిడిపి కార్యాలయంలో జగనా సుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబ్జీ మాట్లాడుతూ మోసపూరిత మైన వాగ్దానాలతో జగన్ అధికారంలోకి వచ్చారన్నారు. తన బాబాయ్ వివేకానంద రెడ్డిని హత్య చేయించి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పై మోపారన్నారు.కోడి కత్తి డ్రామా తో అధికారం చేజిక్కించుకున్న జగన్ ఇప్పుడు ప్రజలను అన్ని విధాలా మోసం చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పి ప్రజలపై పన్నుల రూపంతో మోయలేని భారాన్ని వేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల బటన్ లు నొక్కుతూ ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల మోసం చేస్తున్న జగన్ కు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమవుతుందన్నారు. జగన్ చేస్తున్న మోసాలపై ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగన్ గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొర్రెల శ్రీధర్, తాడేపల్లిగూడెం రూరల్ పెంటపాడు మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, కిలపర్తి వెంకట్రావు, మైనార్టీ సెల్ నాయకులు షేక్ బాజీ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు గంధం సతీష్, నాయకులు ముత్యాల సత్యనారాయణ, వాడపల్లి సుబ్బరాజు, పాతూరి రాంప్రసాద్ చౌదరి, పద్మనాభుని మురళి, ముప్పిడి రమేష్ ముత్యాల శ్రీనివాసరావు, ఏరు బండి సతీష్, ఏలుగొట్ల వెంకట రామారావు, మార్లపూడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కట్టుపాలెంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి

**విశాలాంధ్ర - పాలకొల్లు:** పాలకొల్లు నియోజవర్గ పరిధిలోని యలమంచిలి మండలం కట్టుపాలెం గ్రామంలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం జరిగింది. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటిం టికి తిరిగి ప్రజల సమస్యలను నమోదు చేసుకుని సమస్యలను పరిష్కరిస్తామని అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే కాలంలో టిడిపిని ఆశీర్వదించాలని ప్రజలను ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు కోరారు. టిడిపి శ్రేణులు పాల్గొన్నాయి.

## ఆక్వా చెరువుల అక్రమ త్రవ్వకాలు ఆపాలి

**విశాలాంధ్ర - ఏలూరు :** ముదినేపల్లి మండలం దేవపూడి గ్రామంలో అక్రమంగా ఆక్వా చెరువుల త్రవ్వకాలు ఆపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలో ఏలూరు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక పవర్ పేటలోని అన్నే భవనంలో అక్రమ ఆక్వా చెరువులు త్రవ్వకాలపై జరిగిన సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడారు. ముదినేపల్లి మండలం దేవపూడి గ్రామంలో 500 ఎకరాల వరకు వరి పండే సారవంతమైన భూములు ఉన్నాయని ఆ భూమిలే ఆ గ్రామంలోని కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు జీవనాధా రమన్నారు. గ్రామంలోని భూస్వాములు సారవంతమైన వ్యవసాయ భూములను ఆక్వా చెరువులుగా త్రవ్వేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. అక్రమంగా తవ్విన ఆక్వా చెరువులను ధ్వంసం చేయాలని, ఇకనుండి చెరువుల త్రవ్వకాలు అనుమతులు ఇవ్వొద్దని కోరారు. గ్రామంలో ఉన్నతాధికారులు పర్యటించి వ్యవసాయ కార్మికులకు, కౌలు రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు. ఆక్వా కాలుష్యం వలన పంటల పండే వరి భూములు చౌడు బారిపోతున్నాయని ఆందోళన చేశారు. ఉపాధి లేక వ్యవసాయ కార్మికులు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా చెరువు తవ్వకాలు ఆపకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఉల్లంకి నాంచారయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిహెచ్. మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గవర్నర్ నియామకంపై హర్షం

**విశాలాంధ్ర - అమలాపురం :** ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్‌గా జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ నియామకం పట్ల ఎన్జేపీ పార్టీ హర్షం వ్యక్తపరిచింది. అమలాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఎన్‌జేపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు బ్రిజేష్ కుమార్ రాష్ట్ర అధ్యక్షులు కడియం సూరిబాబు ఆదేశాల మేరకు, ఎన్‌జేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వము ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్‌గా జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ప్రకటించినందుకు హర్షం వ్యక్తపరిచారు. జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ హైకోర్ట్ అడ్వకేట్‌గా, హైకోరు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, కీలకమైన సమస్యలపై ట్రిపుల్ తలాక్ అయోధ్య రామ జన్మభూమి తీర్పులు ధర్మ శాసనంలో సభ్యుడుగా సభ్యుడిగా పని చేశారని, పలు పదవులు నిర్వహించిన కేంద్ర ప్రభుత్వము, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ని నియమించిన పట్ల హర్షం వ్యక్తం పరిచారు,

## మండల పరిషత్ కార్యాలయంలో ఏసీ దొంగతనం

**- కలెక్టర్ దృష్టిలో ఇసుక దొంగతనం మట్టి మాఫియా**
**- చాట్రాయి మండలంలో ఏం జరుగుతోంది**

**విశాలాంధ్ర-చాట్రాయి:** చాట్రాయి మండలంలో పరిపాలన వ్యవస్థ భ్రష్టు పట్టి పోయిందని పలువురు అంటున్నారు.చాట్రాయి మండల పరిపాలన కేంద్ర కార్యాలయంలో ఏసి పోయిందని సుమారు గత 3 నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ కేసు నమోదు చేశారో లేదో తెలియదు.అప్పట్లో నూజివీడు డిఎస్ పి సైతం ఆరా తీసారని తెలిసింది. ఇప్పటివరకూ దాని ఊసెత్తిన దాఖలాలు లేవని తెలుస్తోంది. మండల ప్రధాన కార్యాలయంలో వున్న విలువైన వస్తువులకే రక్షణ లేనప్పుడు మిగతా విషయాలు పరిస్థితి ఏమిటి అనేది ప్రశ్నార్థకం అవుతుంది. విచారణ ముందుకు వెళ్లకుండా పెద్ద శక్తులే అడ్డుకొనే ఉంటాయని పలువురు అంటున్నారు. ఇసుక గురించి కృష్ణా రావుపాలెంలో మట్టి మాఫియా గురించి కలెక్టర్ దృష్టి కి వెళ్ళి నట్లు తెలుస్తోంది. పరిపాలన వ్యవస్థ ఇంత దుర్భరంగా వుంటే ఎలా అని పలువురు అంటున్నారు. ఇటీవల చిన్నంపేట కోపరేటివ్ ఫాం దళితవాడకు చెందిన బాలిక కావ్య క్యాన్సర్ వ్యాదితో బాధపడుతూ రాయవెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు కి విషయం తెలిసిన వెంటనే మానవతాదృక్పదంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రాణాపాయ స్థితిలో వున్న చిన్నారి వైద్య ఖర్చులు కోసం సిఎం సహాయనిధి నుంచి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించి ఆకుటుంబాన్ని ఆదుకున్నారు.దళితుల మన్ననలు పొందారు.అంతే కాదు దళితవాడకు వారినివాసానికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసుకోవడానికి ఆకస్మికంగా బాధిత కుటుంబాన్నిపరామర్శించారు. కలవడం కొంత మంది కి ఇష్టం లేక ఆయన అలా మనకు చెప్పాపెట్టకుండా వెళ్ళడంఏంటీ..? లోలోపల పెద్ద ఎత్తున చర్చలు జరినట్లు తెలిసింది. సాయం చేసి చూడటానికి ఒక ఎంపి స్వయంగా వెళ్ళితేనే పార్టీ దెబ్బతింటుందనే వాళ్ళ పరిపాలన అస్తవ్యస్తంగా తయారైతే పార్టీ పాడుకదా అని పలువురు చర్చించుకోవడం గమనార్హం.

## అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**విశాలాంధ్ర - ముమ్మిడివరం :** తెలుగు నాడు అంగన్వాడి డ్వాక్రా సాధికార కమిటీ పిలుపుమేరకు రాష్ట్ర తెలుగు నాడు అంగన్వాడి డ్వాక్రా సాధికారిక ఆర్గనైజింగ్ కార్యదర్శులు మెండి కమల, వాసంశెట్టి అమ్మాజీల ఆధ్వర్యంలో ముమ్మిడివరం టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెండి కమల, వాసంశెట్టి అమ్మాజీలు మాట్లాడుతూ అంగన్వాడీల కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించి పదవి విరమణ ప్రయోజనాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫేస్ యాప్ రద్దు చేయాలని, మెనూ చార్జీలు పెంచడంతో పాటు పెండింగ్ టిఏ బిల్లులను విడుదల చేయాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు దూరం చేస్తున్న ఆదాయ పరిమితి నిబంధనను సడలించాలని, అంగన్వాడీలకు ఆరోగ్య బీమా కల్పించాలని, 500 మంది జనాభా దాటిన మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ అంగనవాడి కేంద్రాలుగా గుర్తించాలని మినీ అంగన్వాడి టీచర్లను మెయిన్ టీచర్‌గా గుర్తించాలని మొదలగు డిమాండ్లతో ముమ్మిడివరం సిడిపిఓ వారికి మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొండేటి వెంకటలక్ష్మి, కుడిపూడి మల్లేశ్వరి, పెదపూడి రుక్మిణి, పేయ్యల అనసూయ, మరియు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు మొదలవారు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

**విశాలాంధ్ర-ఏలూరు:** నగరంలో చాటపర్రు, ఏలూరులో డి కే టి హెల్త్ కేర్ ఇండియా అను ఫార్మా కంపెనీలో ఏరియా సేల్స్ మేనేజర్‌గా చేస్తున్న పల్లె నగేష్ అనే వ్యక్తి, లైసెన్సులు లేకుండా అక్రమంగా సిలదేనాఫైల్ చిట్రేట్ , అల్ప్రేజలోమ్ మందులు నిల్వ ఉంచి తణుకు, భీమవరంకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించి ఏలూరు డ్రగ్స్ ఇన్ స్పెక్టర్, దత్తి సునీత ఆధ్వర్యంలో భీమవరం డ్రగ్స్ ఇన్ స్పెక్టర్, తణుకు డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ లు దాడిచేసి నిందితుడి వద్ద నుండి రూ. 5 లక్షల50వేలు విలువైన మందులను స్వాధీనపరచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ మందులు నిందితుడు కర్ణాటక, ఒడిషా నుండి నాగేశ్వర ఎంటర్ ప్రైజెస్ అను నకిలీ సంస్థ పేరు మీద పలు ట్రాన్స్ పోర్ట్ సంస్థల ద్వారా ఏలూరు నగరానికి ఎటువంటిబిల్లులేకుండారప్పించుకుని తణుకు, భీమవరంలో పట్టణాలలో లైసెన్సులు లేని వారికి అక్రమంగా అమ్ముతున్నాడని తెలియజేసారు. లైసన్స్ లేకుండా అక్రమముగా మందులు విక్రయిస్తున్న నిందుతుడు పల్లె నగేష్ పై కేసు నమోదు చేసినట్లు ఏలూరు డ్రగ్ ఇన్ స్పెక్టర్ దత్తి సునీత మీడియాకు తెలిపారు.

## ఆంధ్ర షుగర్స్ అధినేత అచ్చిబాబు పరామర్శ

**విశాలాంధ్ర - కొవ్వూరు:** కొవ్వూరు మండలం, కొవ్వూరు నియోజకవర్గం, పసివేదల గ్రామంలో ఇటీవల మరణించిన తెలుగుదేశం పార్టీ నాయకుల,కార్యకర్తల, కుటుంబాలను ఆ పార్టీ ముఖ్యనేత,ఆంధ్ర షుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)పరామర్శించి మరణించిన కుటుంబాలకు ప్రగాడ సానుభూతిని తెలిపారు. ఈనెల మూడవ తేదీన పసివేదల గ్రామానికి చెందిన గారపాటి రామచంద్రరావు మరణించిన విషయం తెలుసుకున్న పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) వారి కుమారుడు గారపాటి శ్రీనివాసరావును కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటీవల మరణించిన మరొక తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత బేతిన నారాయణ తోడల్లుడు నీరుకొండ సుబ్బారావు మరణించిన విషయాన్ని తెలుసుకున్న పెండ్యాల అచ్యుతరామయ్య వారి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి సానుభూతిని తెలియజేసి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ, అధికార ప్రతినిధి కే.వీ.కే రంగారావు, దొమ్మేరు మాజీ సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ,తాళ్లూరి బుల్లి గురవయ్య,గారపాటి రామచంద్రరావు,తుంపెల్ల ఆదినారాయణ,తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధులు, పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ

**విశాలాంధ్ర - పెదపూడి :** పద్మశాలీల సంఘం కాకినాడ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల కన్వీనర్ పప్పు సింహాచలం జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వృద్ధులకు, పేదలకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ విప్ సమ్మంగి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ పప్పు సింహాచలం పుట్టినరోజు వేడుకలను వృద్ధులు పేదల మధ్య జరుపుకోవడం అభినందనీయమన్నారు. నిరంతరం తమ శక్తి మేరకు సేవలందిస్తున్న సింహాచలం గతంలో ఆర్ఎంపి వైద్యం ద్వారా కూడా గ్రామంలో విశేష సేవలు అందించారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, పద్మశాలీల సంఘం అభివృద్ధి సంక్షేమానికి నిరంతరం అందు బాటులో ఉండి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం పప్పు సింహాచలం సతీమణి కల్పన అంజలి, తల్లి తండ్రి నాగమణి జోగారావు, సోదరి సీతారత్నం తదితరులు చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు మార్ని వెంకట్రావు చౌదరి, పంపన రమణ ఇందుకుపల్లి కాటయ్య, గోపి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలేకుర్రులో ఇదేం కర్మ మన రాష్ట్రానికి

**విశాలాంధ్ర - కాకినాడ :** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ జైభీమ్ పేట గ్రామంలో ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి ఇంటి ఇంటికి తెలియజేశారు. అదేవిధంగా వైయస్సార్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలను ఏవిధంగా మోసం చేస్తున్నారో వివరించారు. కరెంట్ బిల్లులు పై, గ్యాస్ ధరలు, నిత్యవసర సరుకులు ధరలు, బస్ ఛార్జీలు, చెత్త పన్ను పై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, క్లస్టర్ ఇన్‌చార్జి మందాల గంగ సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌చార్జి జక్కల ప్రసాద్ బాబు, బూత్ ఇన్‌చార్జి బండి లక్ష్మణబాబు, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, కట్టా త్రిమూర్తులు, మోర్త భైరవమూర్తి, మౌళి, మూర్తి, వీరన్న, రామకృష్ణ, శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, వాకపల్లి చిరంజీవి రాంజీ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు

**విశాలాంధ్ర-గోకవరం :** తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట నియోజకవర్గంలోని గోక వరం మండలం గోకవ రంలో ఈనెల 15వ తేదీన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సంద ర్భంగా రాష్ట్ర మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, జగ్గంపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాజానగరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ లతో కలిసి గోకవరం, గుమ్మల దొడ్డి గ్రామాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. గోకవరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు నాయుడు పూలమాలలు వేయడానికి ఏర్పాటు చేశారు. ముందుగా జగ్గంపేట నియోజకవర్గంలో చంద్రబాబు నాయుడు ప్రవేశించే గుమ్మల దొడ్డి గ్రామం వద్ద మహిళలు హారతులు ఇచ్చే విధంగా స్వాగత ఏర్పాట్లు చేసినట్లు, అనంతరం గోకవరంలో ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి తరువాత జగ్గంపేట రోడ్డు మార్గాన బయలుదేరి జగ్గంపేట వెళ్తారని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. 16వ తేదీ ఉదయం జగ్గంపేట నియోజకవర్గం లోని నాయకులు, కార్యకర్తలతో ఫోటోషూట్ లో పాల్గొని అనంతరం పెద్దాపురం నియోజక వర్గం బయలుదేరి వెళ్తారని తెలిపారు.

## వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ విచారణ ముమ్మరం చేయాలి



**విశాలాంధ్ర - పి గన్నవరం :** వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ విచారణ ముమ్మరం చేయాలని పి గన్నవరం నియోజకవర్గ టిడిపి కో కన్వీనర్ నామన రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పి గన్నవరం మండలంలోని లంకల గన్నవరంలో ఆయన జగనాసుర రక్త చరిత్ర అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వివేకానంద రెడ్డి హత్య కేసును ఎన్నికల సమయంలో సీఎం జగన్ రాజకీయ లబ్ధి కొరకు వినియోగించుకున్నారన్నారు. వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో వారి కుటుంబ సభ్యుల హస్తం ఉండడం, హత్య కేసులో వారి కుటుంబానికి చెందిన పలువురు నిందితులుగా ఉండడం చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు, సాంసాని పెద్ది రాజు పాల్గొన్నారు.

## బీజేపీ పటిష్టతకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

**విశాలాంధ్ర - కిర్లంపూడి :** భారతీయ జనతా పార్టీ పటిష్టతకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు దాట్ల కృష్ణవర్మ, స్టేట్ కౌన్సిల్ మెంబెర్ గారపాటి రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని కిర్లంపూడిలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం సోమవారం మండల బిజెపి అధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు దాట్ల కృష్ణ వర్మ, స్టేట్ కౌన్సిల్ మెంబర్ గారపాటి రాజేశ్వరరావు ముఖ్య అతిధులు హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మండలంలో భాజాపా పార్టీ కార్యకలాపాలు విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ విధి విధానాలపైనా, అమలు చేస్తున్న పలు కేంద్ర సంక్షేమ పథకాల పైనా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు జ్యోతుల దుర్గాప్రసాద్, దొడ్డా అప్పారావు, గొంతిన సహా దేవుడు, బీసీ మోర్చా అధ్యక్షులు శీలం లక్ష్మణ్ స్వామి పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాళ్ళపూడి మండల జనసేనలో వర్గ విభేదాలు

**పోలీస్ స్టేషన్‌కు చేరిన వివాదం**

**విశాలాంధ్ర - తాళ్లపూడి :** తాళ్ళపూడి మండల జనసేన పార్టీలో చాప క్రింద నీరులా కొన్నాళ్లుగా సాగుతున్న వర్గ విభేదాలు రచ్చకెక్కి, చివరకు పోలీస్ స్టేషన్ కు చేరాయి. మండల జనసేన నాయకులు గంటా కృష్ణ వేగేశ్వరపురంలో ఆదివారం తలపెట్టిన సమావేశం, పార్టీ చేరికలు పాదయాత్ర ల సందర్భం లో స్థానిక జనసైనికులు అడ్డంకి కల్పించారు. తమ ప్రమేయం లేకుండా కొన్ని సంవత్సరాలుగా పార్టీ లో కొనసాగుతూ, పార్టీ మాండిట్‌తో పోటీ చేసిన తమను విస్మరించి జనసేన కార్యక్రమాలు నిర్వహించటాన్ని తైలం బాబ్జి, పోసారావు, బుద్ధాల గాంధీ తదితరులు వ్యతిరేకించడం తో ఈ రెండు వర్గాల జన సైనికులు వేగేశ్వరపురంలో బాహాభాహికి దిగారు. గతం నుండి వర్గ విబేధాలు కొనసాగుతుండగా, ప్రస్తుతం బహిరంగ మయ్యాయి. ఈ వివాదాన్ని పురస్కరించుకుని తైలం బాబ్జి, వర్గీయులు నియజక వర్గ నాయకులు గాయత్రి వెంకటేశ్వరరావు, మండల నాయకలు గంటా కృష్ణ ల చర్యలను విమర్శిస్తూ మీడియాకు ఎక్కారు. భారీగా చేరికలు, జనసేన పార్టీ అధిష్ఠానం ప్రకటించిన కార్యక్రమాలను చేపట్టేందుకు గ్రామానికి వస్తే తమ పై దాడి చేసి, జిల్లా కార్యదర్శి ని కులం పేరుతో తిట్టారని గంట కృష్ణ వర్గం తాళ్ళపూడి స్టేషన్ లో సోమవారం పిర్యాదు చేసారు. పార్టీలో ఉన్న కొంత మంది సీనియర్లు గొడవలు పడవద్దని పార్టీ అధిష్ఠానం వద్ద ఈ సమస్యపై సలహాలు తీసుకుందామని చెప్పినా వర్గ పోరు బయట పడింది. ఇరువర్గాలతో విచారణ చెయ్యాల్సిఉందని, తాళ్ళపూడి ఎస్సై కె.వి.రమణ జనసేన పార్టీ ఫిర్యాదు పై స్పందించారు. కొవ్వూరు నియోజకవర్గంలో పార్టీ ప్రతినిధిగా గ్రామాల్లో తిరుగుతున్న తనపై కూడా నియోజక వర్గ నాయకులు గాయత్రి వెంకటేశ్వరరావు మీడియా వేదికగా తనను కించపరుస్తూ మాట్లాడటం పట్ల చెట్టే శుభాషిణి, వేగేశ్వరపురం ఎంపీటీసీ గా పోటీచేసిన తన ను దుర్భాషలాడారని తైలం పోసారావు, పార్టీ కోసం ఎప్పటి నుండో పనిచేస్తున్న వారిని గంటా కృష్ణ పట్టించుకోరని ఎంపీటీసీ హరి బాబు, తదితరులు ప్రస్తుత మండల నాయకత్వం పై విమర్శలు గుప్పించారు.

## రేడియోతో విద్యార్థులకు కల్పనాశక్తి

**విశాలాంధ్ర - కాకినాడ :** కాకినాడలోని పిఠాపూర్ రాజాస్ ప్రభుత్వ కళాశాలలో సోమవారం ప్రపంచ రేడియో దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. యునెస్కో సహకారంతో పిఠాపూర్ రాజాస్ ప్రభుత్వ కళాశాల జర్నలిజం విభాగం మరియు రేడియో అల 90.8 ఎఫ్ఎం సంయుక్తంగా నిర్వహించిన "ఆధునిక సమాజంలో రేడియో పాత్ర" అనే అంశంపై నిర్వహిం చిన సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివి తిరుపాణ్యం ఆధ్యక్షత వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు రేడియో వినడం అలవరచుకుంటే కల్పనాశక్తితో పాటుగా సృజనాత్మక శక్తి పెంపొందు తుందని అన్నారు. ఈ నాటి సమాజంలో ఎలక్ట్రానిక్ మీడియా వేగ వంతంగా అభివృద్ధి చెందడానికి రేడియో కారణమన్నారు. జర్నలిజం విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. మరో అతిథి, సంఘ మిత్ర ఫౌండేషన్ ఛైర్మన్ అల్లూరి సురేంద్ర మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో రేడియో కీలకపాత్ర పోషించిందని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ తిరుపాణ్యం మాట్లాడుతూ సమా చార వ్యవస్థ గతినే మార్చేసిన ఘనత రేడియో కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ పి హరిరామ ప్రసాద్, రేడియో అల 90.8 ఎఫ్ఎం స్టేషన్ డైరెక్టర్ ఎం సత్య, జర్నలిజం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో కోలాటం ప్రదర్శన

**విశాలాంధ్ర - ప్రత్తిపాడు :** కాకినాడ జిల్లా ప్రతిపాడు మండలం ప్రత్తిపాడు కార్యాలయం వద్ద కోలాట ప్రదర్శన గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. యువతులు, చిన్నారులు కలిసి సుమారు 40 రోజులుగా శిక్షణ పొంది మొదటి ప్రదర్శనను గురువర్యుల ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమం కొట్టేటి శ్రీనివాసరావు శేషు కుమారి దంపతులు మరియు గనేశ్వరరావు రమాదేవి దంపతులు ఆధ్వర్యంలో కోలాటం బృందం శిక్షణ పొందారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు జడ్పిటిసి బెహరా రాజేశ్వరి దొరబాబు, గ్రామ సర్పంచ్ గూడాల విజయలక్ష్మి వెంకటరత్నం మరియు ఇతర నాయకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించి కార్యక్రమం ప్రారంభించారు. సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్రాచీన కళలు అంతరించిపోతున్న తరుణంలో కోలాటం వంటి కళలను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి ప్రాచీన కళలు గ్రామాల్లో సమైక్యతకు దోహదపడతాయని జడ్పిటిసి రాజేశ్వరి అన్నారు. కోలాటం ప్రదర్శించిన నిర్వాహకులను కోలాట బృందాన్ని అభినందించారు. ఈ కోలాట బృందం అధ్యక్షురాలు, నిర్వాహకురాలు శేషు కుమారి, రమాదేవి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి గ్రామంలో సహకరించిన సత్య సాయి నాగేశ్వరరావు, లక్ష్మణ్ కుమార్‌కి మరియు ఆర్థికంగా సహకరించిన మదినే నూకరాజు, మేడిశెట్టి శ్రీను మరి కొందరు అందించిన సహాయ సహకారాలు మరువలేని అన్నారు. వారికి కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. కార్యక్రమానంతరం వారిని సన్మాన సత్కారాలను గావించారు. ఈ కార్యక్రమమునకు తిరుమల తిరుపతి దేవస్థానమునకు సంబంధించిన దాస్య సాహిత్య ప్రాజెక్ట్ సభ్యులు గురువర్యులు పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు వాస్తవ్యులు నిమ్మగడ్డ వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో, అద్భుతమైన సంగీత గాన మాధుర్యంతో విశేషంగా ఆకట్టుకుంది.

## ఇన్‌చార్జి ఎంపీడీవోగా వేణుగోపాల్

**విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం రూరల్ :** మండల ఇన్‌చార్జి ఎంపీడీవో గా వేణుగోపాల్ సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీవోగా పనిచేసిన మల్లికార్జునరావు పదోన్నతి పై వెళ్లడంతో ఈవోపీఆర్డి గా ఉన్న వెంకటేష్ ఇప్పటివరకు ఇన్చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా కలెక్టర్ నుంచి ఇంచార్జ్ ఎంపీడీవో గా వేణుగోపాల్ కు ఉత్తర్వులు జారీ కావడంతో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం వేణుగోపాల్ పంచాయతీరాజ్ డి ఈ గా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్‌ను యుపిఆర్‌డి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవిచంద్ర, శ్రీనివాస్, బ్రహ్మం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యుల మండల కమిటీ ఎన్నిక

**విశాలాంధ్ర-కుక్కునూరు :** ఆర్.ఎం.పి వైద్యుల మండల కార్యవర్గ కమిటీ సోమవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం పుల్లారావు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం మండల అధ్యక్షుడిగా కొంగా దైవ ప్రసాదరావు, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా షేక్ చాంద్ పాషా ,ట్రెజరర్ గా ముగుడ నాని, కార్యవర్గ సభ్యులుగా వడ్డాది వెంకటేశ్వర్లు, బొక్క రాంబాబు, ఎస్కే ఖలీల్, ఎస్. నాగరాజు, వై.వెంకట్ రమణ, బొల్లు శ్రీనివాస్, సిహెచ్ వి ఎస్ ఆర్ కే ప్రసాద్, నాగేంద్ర, ఎస్.పవన్ కళ్యాణ్, ఎస్కే దావూద్, కె. శ్రీనివాస్, ఎన్నికయ్యారు.

## గురుకులం విద్యార్థిది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

**బాధిత కుటుంబానికి 50 వేల ఆర్థిక సాయం**

**విశాలాంధ్ర- కాట్రేనికోన :** ఆత్మహత్య చేసుకున్న అల్లవరం మండలం గోడి గురుకుల పాఠశాల విద్యార్థి రాజ్ వర్ధన్‌ది ప్రభుత్వ హత్యే అని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి జియం హరీష్ బాలయోగి విమర్శించారు. ప్రభుత్వ అసమర్థతతో ప్రాణం కోల్పోయిన విద్యార్థి కుటుంబాన్ని బెదిరించి పోలీసులు తప్పుడు స్టేట్మెంట్ ఇప్పించి సమస్యని పక్కదారి పట్టిస్తున్నారని దీనిపై న్యాయం జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ వినతిపత్రాన్ని పంపడం జరిగిందని తెలిపారు. వసతిగృహంలో సమస్యల కారణం, సరైన భోజనం, త్రాగునీరు లేక తన తండ్రి గురుకుల హాస్టల్‌కి పంపించేస్తరనే భయంతోనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని హరీష్ ఆరోపించారు. సోమవారం పల్లంకురు శివారు గొల్ల గరువులో రాజ వర్ధన్ కుటుంబ సభ్యులను హరీష్ పరామర్శించారు. కుటుంబానికి 50వేల రూపాయలు ఆర్థిక సహాయంను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడి వసతిగృహంలో సౌకర్యాలు లేమితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని చదువు మీద శ్రద్ధ చూపించలేక వత్తిడికిలోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థి కుటుంబానికి అండగా వుంటామని, వారి తరుపున ఎటువంటి పోరాటానికి సిద్దంగా ఉంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.